క్లుప్తంగా

కబడ్డీ విజేత విశాఖపట్టణం



ట్రోఫీ అందుకుంటున్న విశాఖ బాలుర జట్టు

కర్నూలు (టౌన్): నగర శివారులోని కేఈ నివాసం సమీపంలో ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ టోర్నమెంటులో బాలుర విభాగంలో విశాఖపట్టణం జట్టు విజేతగా కర్నూలు జట్టు రన్నరప్‌గా, అలాగే బాలికల విభాగంలో విశాఖపట్టణం జట్టు విజేతగా కర్నూలు జట్టు రన్నరప్‌గా నిలిచాయి. మూడవ స్థానంలో చిత్తూరు జట్టు, నాలుగవ స్థానంలో అనంతపురం జట్టు నిలిచాయి. విజేతలకు కప్పును మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజేతలుగా నిలిచిన జట్టు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ టోర్నమెంటులో పాల్గొంటారని తెలిపారు. కబడ్డీ రాష్ట్ర కార్యదర్శి పద్మజ, మల్లికార్జున రెడ్డి, రాజశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో ఈ నెల 30, 31 తేదీల్లో జరిగే ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, జీఓలు 21, 31లను రద్దు చేయాలని కోరుతూ మహాసభల్లో తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, నాయకులు భీమరాజు,రాము పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ జయప్రకాష్

కర్నూలు(హాస్పిటల్): కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించరాదని కంటి వైద్యుడు డాక్టర్ జయప్రకాష్ అన్నారు. బాలసాయిబాబా జయంతి పురస్కరించుకుని బాలసాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సందీప్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కల్లూరులోని ఆదిత్య పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు, ప్రభాకర్, కరెస్పాండెంట్ వాసుదేవయ్య, నరసింహయ్య పాల్గొన్నారు.

మోదీ పర్యటనను నిరసిస్తూ నేడు సీపీఎం ధర్నా

కర్నూలు(సెంట్రల్): విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు.

సెమిస్టర్ పరీక్షలకు 92 శాతం మంది హాజరు



ఆర్‌యూలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరిగిన బీఈడీ రెండవ సెమిస్టర్ 92 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 3,861 మందికి 3,559 మంది హాజరు కాగా 302 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి చూచిరాతకు పాల్పడగా డిబార్ చేశారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ వర్సిటీలోని పరీక్ష కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

రేషన్ పంపిణీపై విచారణ

కల్లూరు: మండలంలోని కె.మార్కాపురం గ్రామంలో రేషన్ పంపిణీపై డీఎస్‌ఓ రాజరఘువీర్ విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రేషన్ బియ్యం పంపిణీపై ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. వచ్చే నెల నుంచి గ్రామ సచివాలయం/ ఏదైనా ప్రభుత్వ స్థలంలో రేషన్ పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్‌ఓ రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

కర్నూలు ఓటర్లు @ 2,74,553

- పురుష ఓటర్లు 1,32,658 మంది, మహిళలు 1,41,869 మంది
- ఇతరులు - 26 మంది
- కర్నూలు నియోజకవర్గ తుది ఓటరు జాబితా విడుదల



కర్నూలు నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి తుది ఓటర్ల జాబితాను సోమవారం రాత్రి మున్సిపల్ అధికారులు విడుదల చేశారు. స్థానిక నగరపాలక కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కర్నూలు నియోజకవర్గ ఓటర్ల జాబితాను వారికి అందజేశారు. అలాగే నగర పాలక కార్యాలయంలో జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు వెల్లడించారు. కర్నూలు నియోజవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల వద్ద సంబంధిత బీఎల్‌ఓలు తమ బూత్ పరిధిలోని ఓటర్ల జాబితాను ప్రదర్శించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇటీవల ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఓటు నమోదు, తొలగింపు వంటి ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. తుది జాబితాలో కర్నూలు నియోజవర్గానికి సంబంధించి మొత్తం 2,74,553 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. పురుష ఓటర్లు - 1,32,658 మంది, మహిళా ఓటర్లు 1,41,869 మంది, ఇతరులు - 26 మంది ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ధనుంజయ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, ఆర్‌ఐ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు షరీఫ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పౌర గుర్తింపు సర్వే వేగవంతం చేయాలి

కర్నూలు (టౌన్): ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతూ ఏ సచివాలయం పరిధిలోనూ నమోదు కాని పౌరులను త్వరితగతిన గుర్తించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. గుర్తించిన వారు ఏ సచివాలయాల పరిధిలోకి వస్తారో అన్నది ధృవీకరించాలన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక కార్యాలయ భవనంలో ప్రత్యేక అధికారులు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయాల పరిధిలో లేని 47,700 మంది వివరాలు సేకరించాలన్నారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, సూపరింటెండెంట్ మన్సూర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్ రూమ్ పనుల పరిశీలన



డిజిటల్ క్లాస్ రూమ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (టౌన్): ఈ నెల 8వ తేదీ లోపు వర్చువల్ ఇంటరాక్టివ్ డిజిటల్ క్లాస్ రూమ్ పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక సుంకేసుల రోడ్డులోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో డిజిటల్ క్లాస్ రూమ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీ రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభించనున్నారన్నారు. ఇందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పార్టిషన్, సీలింగ్, ఇంటర్నెట్ సదుపాయం, కంప్యూటర్ ఏర్పాటు వంటి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ ఎస్‌ఈ, జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యా బోధనకు వీలుగా ఇంటర్నెట్ కనెక్షన్ స్పీడ్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా విద్యాశాఖాధికారి పాల్, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కేవీఆర్‌లో బోటనీ ఎక్స్‌పో

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం బోటనీ ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించి ప్రసంగించారు. క్లస్టర్ యూనివర్సిటీలో చేరితే డిగ్రీతో పాటు, పీహెచ్‌డీ వరకు చదువును కొనసాగించవచ్చన్నారు. వర్సిటీలో అనుభవం, ఉన్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవికారాణి కాలేజీలో ఉండే వివిధ కోర్సుల గురించి, వాటి భవిష్యత్తు ప్రయోజనాల గురించి వివరించారు. వృక్షశాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ జీవీ రంగారెడ్డి, ఎస్.సునీత, మైఖేల్ డేవిడ్, హెలెన్ కుమారి, శైలజ, భవాని, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలు కంపు కొడుతున్నాయి

- మురుగు కాల్వలు నిర్మించండి
- పీజీఆర్ఎస్‌లో కమిషనర్‌కు వినతి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): తాము నివసించే కాలనీలు కంపు కొడుతున్నాయి. మురుగు కాల్వలు నిర్మించాలని కృష్ణానగర్ కేడీసీసీ బ్యాంకు ఎటీఎం పక్కనున్న లైన్ కాలనీవాసులు, బీటీఆర్ నగర్ వాసులు, పార్థసారధి, రాధాకృష్ణ, రమణ విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. నగరపాలక అదనపు కమిషనర్ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ కే.విశ్వేశ్వర రెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, ఎంఈ సత్యనారయణ, టీపీఆర్‌ఓ వెంకట లక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ప్రజలు అర్జీల ద్వారా లేవనెత్తిన సమస్యలు

- నగరపాలక సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన తమ తల్లితండ్రుల స్థానంలో కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని చింతలముని నగర్‌కు చెందిన వెంకటకుమార్ అభ్యర్థించారు.
- మారుతినగర్‌లో పార్కును అభివృద్ధి చేయాలని వాకింగ్ ట్రాక్, బెంచీలు ఏర్పాటు చేయాలని స్థానికులు చాంద్‌హుస్సేన్, ఇషాక్ విన్నవించారు.
- టిడ్కో గృహానికి అనర్హత వచ్చినందున తాము చెల్లించిన డీడీ వెనక్కు ఇవ్వాలని విజయమ్మ, యలమ్మ, దానమ్మ విన్నవించారు.
- ముజఫర్ నగర్‌లోని నందూరి ప్రసాదరావు మెమోరియల్ కమ్యూనిటీ హాలులో ఉన్న సచివాలయాలను తరలించి ప్రజలు ఉపయోగించుకునేందుకు ఇవ్వాలని కమ్యూనిటీ హాలు నిర్వాహకులు సుధాకరప్ప, రాధాకృష్ణ అభ్యర్థించారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో చేపట్టనున్న అభివృద్ధి పనులలో భాగంగా మంగళవారం కర్నూలు నగరంలోని క్యాంప్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బీ క్యాంప్, విజ్ఞాన మందిర్, అరోరానగర్, శ్రీలక్ష్మీనగర్, పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు బిర్లాగేట్, ఎండోమెంట్ కాలనీ, బిర్లాగడ్డ, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

11న షటిల్ టోర్నీ

కర్నూలు (టౌన్): ఈనెల 11వ తేదీ ఉదయం 8 గంటలకు జొహరాపురం రోడ్డులోని జె.జె.షటిల్ క్లబ్‌లో పొంగల్ డబుల్స్ షటిల్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు షటిల్ క్లబ్ నిర్వాహకులు జాన్, కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు వరుసగా రూ.5 వేలు (ప్రథమ), రూ.3 వేలు (ద్వితీయ), రూ.2 వేలు (తృతీయ) నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. 40 సంవత్సరాల వయస్సు పైబడిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఈ టోర్నమెంటులో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలు, పేర్ల నమోదుకు 82977 33555 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

న్యాయవాదులకు కోర్టు డైరీ ఎంతో ముఖ్యం



డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(సెంట్రల్): న్యాయవాదులకు కోర్టు డైరీ ఎంతో ముఖ్యమని, దాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ లీలా వెంకట శేషాద్రి సూచించారు. సోమవారం లీగల్ సర్వీసు అథారిటీ కార్యాలయంలో భారత న్యాయవాదుల సంఘం రూపొందించిన కోర్టు డైరీ, గోడ గడియారం, టేబుల్, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో న్యాయవాదుల సమస్యలు, సామాజిక అంశాలపై భారత న్యాయవాదుల సంఘం కృషి ఎంతో ఉంటుందన్నారు. రాష్ట్ర బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుడు రవిగువేర, భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాదు, జిల్లా కోశాధికారి పి.దస్తగిరి పాల్గొన్నారు.

8 నుంచి చేనేత, హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన

కర్నూలు(అగ్రికల్చర్): లేపాక్షి థీమాటిక్ ఎగ్జిబిషన్ ఈ నెల 8 నుంచి కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లుగా మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో హస్తకళా, చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో కొండపల్లి బొమ్మలు, బంజారా-క్రోచెట్ లెస్, ఏటికొప్పాక బొమ్మలు, వైట్ మెటల్ బొమ్మలు, స్టోన్‌వేర్ ఫొటో ఫ్రేమ్‌లు, రోజ్‌ఉడ్ బొమ్మలు, వెల్వెట్ కార్పెట్స్, లెదర్ పప్పెట్రీ, వైట్ ఉడ్ బర్డ్స్, స్టోన్ కార్వింగ్, బ్లాక్ మెటల్ క్రాఫ్ట్, చేనేత చీరలు, డ్రస్ మెటీరియల్ కలంకారీ, పోచంపల్లి, నారాయణవనం, కాశ్మీరీ షాల్స్ లభిస్తాయని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల వస్తువులు ఉత్పత్తి ధరలకే లభిస్తాయని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ విశ్వ ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీ వరకు హ్యాండీక్రాఫ్ట్ వస్తువులపై 15 శాతం, హ్యాండ్‌లూమ్‌పై 10 శాతం డిస్కౌంట్ లభిస్తుందని తెలిపారు.

దళిత, గిరిజనులకు రక్షణ కల్పించాలి




మాట్లాడుతున్న చిక్కం జానయ్య మాదిగ

కర్నూలు(అర్బన్): ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం గ్రామంలో దళితులు, గిరిజనులకు రక్షణ కల్పించాలని జైభీం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ కోరారు. గత పది రోజుల క్రితం నందవరం గ్రామంలో రెండుచోట్ల జరిగిన దాడులు, అణచివేతకు సంబంధించి పోలీసులు ఒక ఘటనపై మాత్రమే కేసు నమోదు చేశారని, మరో ఘటనపై కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నందవరంలో నేటికి కుల వివక్ష, అంటరానితనం, అణచివేత కొనసాగుతున్నా పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం లేదన్నారు. దళితులపై దాడులు చేసిన ఘటనలో అభం శుభం తెలియని వ్యక్తులపై కేసులు బనాయించారన్నారు. బీసీ, ఆధిపత్య కులాలు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టినా ఇంత వరకు కేసులు నమోదు చేయలేదన్నారు. దళిత, గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సప్పోగు ప్రశాంత్ కుమార్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి ఆరేకంటి సత్యన్న మాదిగ, నాయకులు మహేష్, జగదీష్ పాల్గొన్నారు.

కళాకారులకు అండగా ఉంటాం

కర్నూలు కల్చరల్: పేద కళాకారులు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని, అలాగే టీజీవీ కళాక్షేత్రం కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరిన రంగస్థల కళాకారుడు శామ్యూల్ కుటుంబానికి సోమవారం టీజీ వెంకటేష్ ఆయన ఛాంబర్‌లో రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు. అదే విధంగా శామ్యూల్‌కు అవసరమైన వైద్య సౌకర్యాలు సమకూరుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో పేద వృద్ధ కళాకారులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ శామ్యూల్ నారద పాత్రతో రాష్ట్రంలోనే పేరున్న నటులన్నారు. ఆయన ప్రమీలార్జున పరిణయం నాటకంలో నారద పాత్రకు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటకంలో నరసింహారెడ్డి అనుచరుడి పాత్రకు నంది అవార్డులు అందుకున్నారనిచెప్పారు. శామ్యూల్ కుటుంబ సభ్యులతో పాటు టీజీవీ కళాక్షేత్రం సహాయ కార్యదర్శి రాజారత్నం పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి



రిలే నిరాహార దీక్ష చేపట్టిన సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదల ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు చొప్పున అందించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి 2 సెంట్ల ఇంటి స్థలం ఇస్తానని మాట ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత హామీపై మాట్లడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర కార్యదర్శి పి.రామకష్ణారెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణకు కొత్త బస్టాండ్, హాస్పిటల్ సమీపాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలన్నారు. నాయకులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీని జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి ఆవిష్కరించారు. సోమ వారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ.బ్రహ్మానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలేశ్వరరెడ్డి, ఈసీ మెంబర్లు మద్దిలేటి, జ్యోతి ప్రభ, జెడ్పీ టైపిస్టులు కిషోర్, విష్ణు, శ్రీధర్, భరత్, జ్యోతిరేఖ, జెడ్పీ ఏఓలు మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, రాంగోపాల్, నాగేంద్రప్రసాద్, సరస్వతమ్మ, నాగరాజు, బసవశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో..



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు (హాస్పిటల్): స్టేట్ ఈసీజీ, కార్డియాలజీ, క్యాథల్యాబ్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుమల రావు, ఉపాధ్యక్షులు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజేంద్ర సురీజీ జయంతి



రాజేంద్ర సురీజీ చిత్రపటం ఊరేగింపు



శోభాయాత్రలో గురు హరాజ్‌లతో పాటు జైన్‌లు

కర్నూలు కల్చరల్: జైనుల గురు మహారాజ్ రాజేంద్ర సురీజీ జయంతి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. జైన్ శ్వేతాంబర్ సంఘం ఆధ్వర్యంలో రాజేంద్ర సురీజీ 198వ జయంతి, 118వ మోక్షప్రాప్తి తిథిని పురస్కరించుకొని సోమవారం ఓల్డ్‌సిటీలోని జైన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి మహావీర్ చౌక్ వరకు గురు మహరాజ్ చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహించారు. గురు మహారాజ్‌లతో పాటు, జైన్ సంఘీలు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య జాగ్రత్తలపై శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్ గ్యాలరీలో హైరిస్క్ ప్రెగ్నెన్సీపై ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్, ట్రాకింగ్‌పై పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వార్డు/గ్రామ మహిళా ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. గర్భిణులకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, షుగర్, కిడ్నీవ్యాధులు, క్షయ, గుండె జబ్బులు, మూర్ఛ, హెపటైటిస్-బి, మలేరియా, గతంలో గర్భం కోల్పోవడం, కవల పిల్లలు, ప్రసూతికి సంబంధించిన శస్త్రచికిత్స, ప్రమాద చిహ్నాలు గల గర్భిణి ఆరోగ్య చరిత్ర గురించి తెలుసుకుని మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలని, ఆ విషయాలను వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం గర్భిణిల్లో ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించే విధానం గురించి రాష్ట్రస్థాయి శిక్షకులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ అనుదీప్తి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీహెచ్‌ఎన్‌ఓ కె.అన్నపూర్ణ, డీపీఓ విజయ, స్టేట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన జిల్లా అథ్లెట్లు



రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పతకాలు సాధించిన కర్నూలు అథ్లెట్లు

కర్నూలు (టౌన్): పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరులో ఈనెల 5వ తేదీన నిర్వహించిన 59వ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు అథ్లెట్లు ప్రతిభ చాటారు. అండర్-16 విభాగంలో కె.మనీష్ (కాంస్యం), బాలికల విభాగంలో టి.లక్ష్మీశాంతి (వెండి పతకం), అండర్- 20 బాలుర విభాగంలో ఎస్.షేక్షావలి (వెండి పతకం), బి.వెంకటేష్ (నాలుగవ స్థానం), అండర్-20 బాలికల విభాగంలో ఎం.ప్రసన్న కుమారి (వెండి పతకం), బి.వీణకుమారి (ఐదవ స్థానం), డి.వెంకటేశ్వరి (నాలుగవ స్థానం) సాధించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన వీరంతా ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ వెల్లడించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీధర్ రెడ్డి

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. సోమవారం స్థానిక ది ఓరియన్ స్కూల్ ప్రాంగణంలో టెన్నికాయిట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. అతిథులు టెన్నికాయిట్ విసురుతూ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెన్నికాయిట్ క్రీడల్లో పాల్గొనడం వల్ల చురుకుదనం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎంపికైన బాలికలు ఈనెల 10, 11 తేదీల్లో శ్రీకాకుళం పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కరెస్పాండెంట్ రమణ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కొండెపోగు చిన్న సుంకన్న, వాలీబాల్ శిక్షకులు రవితేజ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన మధు సుధాకర్

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో పని చేస్తున్న వృక్షశాస్త్రం అధ్యాపకుడు మధు సుధాకర్‌కు డాక్టరేట్ లభించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందికొట్కూరు మండలం మల్యాల గ్రామానికి చెందిన దండుగుల మధు సుధాకర్ 16 ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్నారు. పరిశోధనపై మక్కువతో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి చెందిన వృక్షశాస్త్రం ఆచార్యులు జి.సుదర్శనం పర్యవేక్షణలో 'శేషాచలం కొండ శ్రేణులలో మొక్కల కిమోటాక్సనమిక్ క్యారెక్టరైజేషన్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ అందించడం సంతోషంగా ఉందని మధు సుధాకర్ సంతోషం వ్యక్తం చేశారు. పరిశోధనలకు సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌తో పాటు, అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌యూలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలోని సమస్యల పరిష్కారానికి ఉన్నత విద్యా మండలి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌యూలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నూతన చైర్మన్ ఆర్‌యూను సందర్శించాలని కోరారు. వర్సిటీలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌యూసీఈలో అవినీతిపై విచారణ చేయించాలన్నారు. వర్సిటీలో పరిశోధనలను పెంచాలన్నారు. ఆర్‌యూసీఈలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ పీఎస్ఎన్ కన్వీనర్ అమర్, వర్సిటీ కో-కన్వీనర్ మౌలాలి, నాయకులు సాగర్, తదితరులు పాల్గొన్నారు.